


ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

# ఖానాపూర్‌లో 77.46 శాతం

ఉట్నూర్, డిసెంబర్ 1 : ఖానాపూర్ నియోజకవర్గంలో గురువారం జరిగిన ఎన్నికల్లో పల్లెలల ఓటర్లు చైతన్యం ప్రదర్శించారు. పోలింగ్ శాతం కూడా ఎక్కువగా కనిపించింది. నియోజకవర్గంలోని మండలాల వారీగా పరిశీలిస్తే సిరికొండలో 88.51 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. జన్నారం 75.09 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. రెండో స్థానం దస్తురాబాద్‌లో 81.33, ఆ తర్వాత ఇంద్రవెల్లిలో 80.28, కడెంలో 79.30, పెంబిలో 79, ఉట్నూర్‌లో 75.66, ఖానాపూర్‌లో 75.53 శాతం నమోదైంది. పట్టణాల్లో మాత్రం ఓటింగ్ శాతం తగ్గుతుండడం గమనార్హం.



అయ్యప్ప మాల ధారణ స్వీకరించిన భక్తులు

## అయ్యప్ప మాలధారణ

దస్తురాబాద్, డిసెంబర్ 1 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు శుక్రవారం అయ్యప్ప దీక్ష స్వీకరించారు. ఖానాపూర్‌లోని మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, గురు స్వామి పాపారావు ఆధ్వర్యంలో మాలధారణను స్వీకరించారు. అంతకుముందు గోదావరిలో స్నానాలు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి, దీక్షాపరులు సిర్ప సంతోష్, వినయ్, కమలాకర్ గౌడ్, ప్రకాశ్, శ్రీనివాస్, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు

దస్తురాబాద్, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ జరిగే వరకు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ గెలుపుకోసం కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు మండలాధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి అర్గుల రాజనర్సయ్య ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తరలించి, పోలింగ్‌ను విజయవంతం చేసిన బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వరి.. సిరి

- ఆశాజనకంగా వరి సాగు..
- దస్తురాబాద్ మండలంలో 8,881 ఎకరాల్లో..
- గతేడాది కంటే 1200 ఎకరాల్లో పెరిగిన సాగు..
- 2,22,025 క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం
- పొట్ట, కోత దశలో పంట..
- మురిసిపోతున్న రైతన్న



దస్తురాబాద్‌లో సాగు అవుతున్న వరి

దస్తురాబాద్, డిసెంబర్ 1 : రైతాంగానికి సాగుబడిలో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. రైతు బంధు సాయం, 24 గంటల ఉచిత కరెంట్, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతూ.. అన్నదాతకు భరోసానిస్తున్నది. సకాలంలో వర్షాలు కురవడం, కడెం ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ ద్వారా సాగునీరు అందడంతో దస్తురాబాద్ మండల రైతులు అధికంగా వరి సాగు చేశారు. కడెం ఆయకట్టు, బోర్లు, బావుల కింద మొత్తం 8,881 ఎకరాల్లో రైతులు వరి పండిస్తున్నారు. ఈ వానకాలంలో ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున మొత్తం 2,22,025 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఆశాజనకంగా ఉంది. కొన్ని చోట్ల ముందు సాగు చేసిన వరి కోతకు వచ్చింది. కోతలు సైతం ప్రారంభించే అవకాశం ఉన్నది. కాగా, గత వాన కాలంలో 7,681 ఎకరాల్లో వరి సాగు చేయగా, 1,92,025 క్వింటాళ్ల ధాన్యం వానాకాలం పంట వచిచనట్లు వివరించారు. ప్రస్తుతం గతం కంటే 1,200 ఎకరాలు అధికంగా రైతులు వరి సాగు చేస్తున్నారు. గతం కంటే ఈ సారి 29,975 క్వింటాళ్ల దిగుబడి అంచనా పెరిగింది.

### సకాలంలో సస్యరక్షణ చర్యళ తో దిగుబడి..

పంట సాగుకు అనుగుణంగాఎరువులు వాడితే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడితే తెగులు ప్రమాదం ఉంటుంది. తద్వారా నష్టపోయే అవకాశం కూడా ఎక్కువ. ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి, వారి సలహాలు, సూచనలు పాటించి, ఎరువులు, మందులు వాడితే ఆశించిన దిగుబడులు వస్తాయని అంటున్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిశాయి. కావాల్సినంత నీరు ఉండడంతో పంట ఏపుగా పెరిగింది. తెగులు వచ్చినా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే దిగుబడి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా..

దిగుబడి ఎంత వస్తుందనేది పక్కాగా అంచనా వేసేందుకు ప్రభుత్వం పంట వివరాల సేకరణ చేపట్టింది. రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా అధికారులు పంట వివరాల సేకరణ చేపట్టి, ఆన్‌లైన్‌లో పంట వివరాల నమోదును పూర్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఈ పంట వివరాలను నమోదు చేశారు. అవసరమైన మేరకు గన్నీ సంచులు తెప్పించుకునేందుకు ఈ పంట వివరాల నమోదు దోహదపడుతున్నది. పంటల నమోదు ఆధారంగా దిగుబడికి అనుగుణంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభ్యుతం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది.



పంటల వివరాలు నమోదు చేసుకుంటున్న వ్యవసాయ అధికారులు

### పెరిగిన వరి సాగు..



*గతంలో కంటే ఈ వానాకాలం వరి పంట సాగు 1,200 ఎకరాలు పెరిగింది. ఈ వానాకాలంలో మండలంలో 8,881 ఎకరాల్లో రైతులు వరి పండిస్తున్నారు. మొత్తం 2,22,025 క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. రైతులు వరిలో మెలకువలు పాటించాలి. అప్పుడే ఆశించిన దిగుబడి సాధిస్తారు. వరి సాగులో వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనల మేరకు వరి సాగు చేస్తే దిగుబడులను పొందే అవకాశం ఉంటుంది. సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.*

**- జాడి తిరుపతి, వ్యవసాయ విస్తరణ అధికారి, దస్తురాబాద్ క్లస్టర్**

# ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత

- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు
- నర్సింగ్ కళాశాలలలో అవగాహన సదస్సు




మంచిర్యాల ఏసీసీ : విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 1: ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత అని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జీ సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ మంచిర్యాల ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డేపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హెచ్ఐవీ పరీక్షలు చేసుకొని మీ ప్రస్తుత స్థితిని తెలుసుకొని ఎయిడ్స్ రోగ వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. జిల్లా దవాఖానతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తునట్టు తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ నీరజ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్ వైజర్ వీ.అనిల్ కుమార్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా, కళాశాల లెక్చరర్లు, వైద్య సిబ్బంది అల్లాడి శ్రీనివాస్, నామ్ దేవ్, రామ్మూర్తి, డెమో వెంకటేశ్వర్లు, విద్యార్థులు, ప్రభుత్వ దవాఖాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్ నివారణపై కొవ్వత్తులతో ర్యాలీ**

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎదుట జిల్లా ఎయిడ్స్ ప్రివెంటేషన్ అండ్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు ఎయిడ్స్ నివారణపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ వీ అనిల్ కుమార్, డెమో వెంకటేశ్వర్లు, ఎన్‌జీవో స్నేహ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




మంచిర్యాల లో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సభ్యులు

**కోటపల్లిలో..**

కోటపల్లి, డిసెంబర్ 1 : కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలపై వైద్యాధికారి సత్యనారాయణ వివరించారు. ఎయిడ్స్ వ్యాధి, నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఏఎన్ఎం విజయ, ఆయూష్ ఫార్మసిస్ట్ బడికెల శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు భారతి, మల్లీశ్వరి, సిబ్బంది ఖలీల్ ఖాద్రీ, గడ్డయ్య, ఫరీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.